క్లుప్తంగా

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండలంలో పండ్ల పెంపకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో రాంప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్టీ, ఎస్సీ, చిన్న, సన్నకారు రైతుల తోపాటు ఉపాధిహామీ జాబ్‌కార్డు, బోరుబావి, విద్యుత్ సౌకర్యం ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులన్నారు. పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, ఉపాధిజాబ్‌కార్డు, పాన్ కార్డు జిరాక్స్‌లతో గ్రామపంచాయతీ తీర్మానంతో పంచాయతీ కార్యదర్శి, ఏఈవో, ఏపీవోకు ఈనెల 31లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: ఆచారి సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని టీఎన్‌జీవో సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నాల దేవన్న, గౌరవ అధ్యక్షుడిగా ఫిరోజ్, ప్రధాన కార్యదర్శులుగా సయ్యద్ అనీస్, ఇర్ఫాన్ ఖాన్, కోశాధికారిగా గంగన్న, సుభాష్ గుప్తా, సలహాదారునిగా సుభాష్‌లను ఎన్నుకున్నారు. ఐక్యంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వం ఆచారిలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఇచ్చోడ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ ప్రీతంరెడ్డి అన్నారు. సోమవారం ఐటీశాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన సందర్భంగా మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కమల జాలైజాకు, సర్పంచ్ చౌహన్ సునీత, ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, జాహెద్, పాఠశాల చైర్మన్ ఆనంద్, శ్యాంరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రమణరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలి

కైలాస్‌నగర్: దివ్యాంగులకు ప్రత్యేకకాలనీ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ)ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన 58వ రోజుకు చేరింది. అయినా.. అధికారులు స్పందించడం లేదని సోమవారం కళ్లకుగంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలో ప్రత్యేక దివ్యాంగుల కాలనీ ఏర్పాటు చేసేంత వరకు పోరాటం సాగిస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

'దళారులను నమ్మవద్దు'

బోథ్: ప్రభుత్వం బీసీలకు లక్ష రూపాయల సాయం అందిస్తుందని ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని ఎంపీపీ తుల శ్రీనివాస్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో దళితబంధు కోసం పలువురు నాయకులకు డబ్బులు ఇచ్చి ప్రజలు మోసపోయారని, ప్రస్తుతం కొంతమంది నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరైనా పథకాల కోసం డబ్బులు డిమాండ్ చేస్తే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

బోథ్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పట్నాపూర్ సర్పంచ్ సుగుణ అన్నారు. సోమవారం మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి మిథున్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన డ్రైవింగ్ శిక్షణ

ఆదిలాబాద్: ఆదిలాబాద్ డిపో పరిధిలో హెవీ మోటార్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో పది మంది డ్రైవర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. సోమవారం డిపో మేనేజర్ కల్పన శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలను మరింతగా మెరుగుపరుచుకోవాలన్నారు.

ప్రజల సహకారం తీసుకోవాలి

బజార్‌హత్నూర్: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం తీసుకోవాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. సీఐ కిరణ్‌కుమార్, ఎస్సైలు సయ్యద్ ముజాహిద్, సందీప్ పాల్గొన్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం రాత్రి దొంగలు రెచ్చిపోయారు. మూడు దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. అంబేద్కర్ చౌక్‌లోని రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడి రూ.40 వేల నగదు ఎత్తుకెళ్లారు. తాంసి బస్టాండ్ ప్రాంతంలోని సూర్య మెడికల్ షాపు షట్టర్ పగులగొట్టి రూ.400 నగదు ఎత్తుకెళ్లారు. మెడికల్ షాపు యజమాని నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అందని 108 సేవలు

- ఆరు నెలల క్రితం అంబులెన్స్ సర్వీస్ ఎత్తివేత
- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- ఇబ్బంది పడుతున్న బాధితులు



సిబ్బందికి కేటాయించిన కార్యాలయం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మండలవాసులు (ఫైల్)

తాంసి: తాంసి మండలానికి అత్యవసర సేవలు అందించే 108 కరువైంది. ఆపదలో ఉన్న వాళ్లు 108కి డయల్ చేస్తే సకాలంలో వాహనం వచ్చే పరిస్థితి లేదు. మండల కేంద్రంలో అందుబాటులో లేకపోవడంతో బాధితులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇంతకు ముందు ఉన్న 108 సర్వీస్‌ను ఎలాంటి కారణం లేకుండా సంబంధిత అధికారులు ఎత్తివేశారు. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులను తరలించేందుకు వాహనం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అరు నెలలుగా లేని అంబులెన్స్ సర్వీస్..

జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్ర వైపు వెళ్లే అంతరాష్ట్ర రహదారి వెంట ఉన్న తాంసి మండలానికి కేటాయించిన 108 వాహనాన్ని గత డిసెంబర్ నెలలో సంబంధిత శాఖ అధికారులు వెనక్కి తీసుకెళ్లారు. అంబులెన్స్ వాహనాల సర్దుబాటులో భాగంగా తీసుకెళ్లిన అధికారులు ఆరు నెలలు పూర్తవుతున్నా.. మండలానికి 108 వాహనాన్ని కేటాయించడం లేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా.. ఎలాంటి ఫలితం లేదు.

ఇతర మండలాల నుంచి రావాల్సిందే..

108కి ఫోన్ చేస్తే ఇతర మండలాల నుంచి వాహన వచ్చే వరకు తీవ్ర జాప్యం జరుగుతోంది. తలమడుగు, భీంపూర్ మండలాల నుంచి 108 వాహనం రావాల్సిన పరిస్థితి. ఆయా మండలాల్లో సర్వీస్‌లు బీజీగా ఉంటే జిల్లా కేంద్రం నుంచి రావాలి. తప్పనిసరి పరిస్థితుల్లో బాధితులను ప్రైవేట్ వాహనాల్లో తీసుకెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని మండలానికి 108 వాహనం కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

108 వాహనం కేటాయించాలి



తాంసి మండలానికి 108 వాహన సర్వీస్ కేటాయించాలి. అత్యవసర పరిస్థితుల్లో తలమడుగు లేదా జిల్లా కేంద్రం నుంచి వాహనాలను పంపుతున్నారు. అక్కడి నుంచి వాహనాలు రావాలంటే చాలా ఆలస్యమవుతుంది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకోని వాహనం కేటాయించాలి.

– నగరం అశోక్, తాంసి

సేవలను విస్తృత పరచాలి



108 సేవలను విస్తృత పరచాలి. మండలంలో ఎక్కువగా మారుమూల గిరిజన పల్లెలు ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక వాహనం కేటాయించాలి. ప్రత్యేక వాహనం లేక ఆరు నెలలు గడుస్తున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

– సామ సంతోష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాంసి

'సఖీ' సేవలపై విద్యార్థులకు అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు, యువతులు, విద్యార్థినులు సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సఖీ కేంద్రం సోషల్ కౌన్సిలర్ లావణ్య అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ హిందీ పాఠశాలలో సఖీ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఆమె మాట్లాడుతూ మహిళలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తే 100, 181, 1098 డయల్ చేయాలన్నారు. గృహహింస, వేధింపులకు గురిచేస్తే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలకు వచ్చేటప్పుడు, ఇంటికి వెళ్లే సమయంలో ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే 100కు డయల్ చేయాలన్నారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, క్యూ ఆర్ కోడ్ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సత్యమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బేల ఎస్సైగా రాధిక

బేల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎస్సై రాధిక బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కృష్ణకుమార్ బదిలీల్లో భాగంగా నిజామాబాద్ 5వ టౌన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు పోలీసు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎస్సై శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ

సిరికొండ: నూతన ఎస్సైగా శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై సిరేష్ నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. శాంతి, భద్రతలు కాపాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

భీంపూర్ ఎస్సైగా లాల్‌సింగ్ నాయక్

తాంసి: భీంపూర్ మండల ఎస్సైగా సోమవారం లాల్‌సింగ్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన రాధిక బేలకు బదిలీ అయ్యారు. తాంసి ఎస్సైగా ఉన్న లాల్‌సింగ్ నాయక్‌ను భీంపూర్ ఎస్సైకు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు.

సీఐకి సన్మానం

బోథ్: బోథ్ సీఐ కిరణ్‌కుమార్ ఇటీవల ములుగు జిల్లాకు బదిలీ కాగా ఆయనను అంబేద్కర్ సంఘం నాయకులు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో రమేష్ బత్తుల, చంటి పసుల, మద్దేల మహేశ్, జక్కుల రవి పాల్గొన్నారు.

'సహకార' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తాంసి: సహకార బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం భీంపూర్ మండల కేంద్రంలో రూ.50 లక్షలతో నిర్మించిన ఏడీసీసీ బ్యాంకు నూతన భవనాన్ని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. భీంపూర్ మండల కేంద్రంలో అన్ని కార్యాలయాల భవనాల నిర్మాణాలను ప్రారంభిస్తామని డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు సీఈవో శ్రీధర్ రెడ్డి, మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, సొసైటీ సీఈవో కేశవ్, జెడ్పీటీసీ సుధాకర్, సర్పంచ్ లింబాజీ, పాండురంగ్, డీసీసీబీ డైరెక్టర్‌లు పురుషోత్తం, గోవర్దన్ యాదవ్, నాగయ్య, అనిల్, సంతోశ్ పాల్గొన్నారు.

'నష్ట పరిహారం అందించాలి'

జైనథ్: పెన్‌గంగ బ్యాక్‌వాటర్, సాత్నాల వాగులతో పంటలు మునిగి నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల నష్ట పరిహారం అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఖాప్రి, కరంజి, ఉమ్రి గ్రామాల్లో పర్యటించారు. అధికారులు సర్వేలు చేయించి, నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని కోరారు. నాయకులు కుంటాల రాములు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు.. మన బడి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. సోమవారం తర్నం(కె) గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. మౌలిక వసతులు, అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

వైద్య శిబిరం

నార్నూర్: గాదిగూడ మండలంలోని ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఖైర్‌డట్వా గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సంజీవ్ రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సంజీవ్ అడే, ఏఎన్ఎంలు మెస్రం శ్రీదేవి, సులోచన, చంద్రకళ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

బోథ్: మండలంలోని కరాత్వడ గ్రామపంచాయతీ పరిధిలోని జీడిపల్లి, టివిటి గ్రామాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బోథ్ బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్, బండి పేపర్లు ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండేలా చూసుకోవాలన్నారు.

రోడ్డు పరిశీలన

నార్నూర్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండలంలోని చిత్తగూడ బాబేఝరి రోడ్డు కోతకు గురైంది. సోమవారం ఎంపీడీవో రమేశ్ రోడ్డును పరిశీలించి మాట్లాడారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామనన్నారు. వర్షాకాలంలో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. గిరిజన నాయకులు సాగర్, లచ్చు, తదితరులు ఉన్నారు.

సవారీబంగ్లా షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

కైలాస్‌నగర్: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని 28వ వార్డు పరిధిలోని బొక్కలగూడలో రూ.5లక్షల వ్యయంతో చేపట్టనున్న సవారీబంగ్లా షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ప్రజల కోరిక మేరకు సవారీ బంగ్లాలు, షెడ్డులు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండ గణేశ్, దయాకర్, సాగర్ పాల్గొన్నారు.

నేడు సీపీఐ, సీపీఎం నిరసన

ఎదులాపురం: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతు న్న దాడులను నిరసిస్తూ.. సీపీఎం, సీపీఐ ఆ ధ్వర్యంలో మంగళవారం చేపడుతున్న నిరసనాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 11 గంటలకు ప్రజాసంఘాలతో కలిసి నిరసన చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్లను పునరుద్ధరిస్తాం

జైనథ్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైన రోడ్లు, వంతెనలను పునరుద్ధరిస్తున్నట్లు ఆర్అండ్‌బీ డీఈఈ సురేశ్ అన్నారు. సోమవారం దీపాయిగూడ, ఆనంద్‌పూర్, కరంజి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. వీలైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసి, ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, తుమ్మల వెంకట్ రెడ్డి, సాయినాథ్, పోతారెడ్డి పాల్గొన్నారు.

చేలల్లో నీరు నిల్వకుండా చూడాలి

జైనథ్: చేలల్లో వరద నీరు నిల్వ ఉండాకుండా చూడాలని ఏవో వివేక్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని కౌఠ గ్రామంలోని పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు నిల్వ ఉండి, ఆకులు ఎర్రబడితే 600 గ్రాముల కాపరాక్సీ క్లోరైడ్‌కు 20 గ్రాముల ప్లాంటమైసిన్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. సర్పంచ్ భోయర్ విజయ్, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న సుహాసినిరెడ్డి

బేల: పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని మాంగ్రుడ్, కొగ్దూర్ శివారుల్లో నష్టపోయిన పత్తి, కంది పంటలను ఆమె పరిశీలించారు. పెన్‌గంగ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పెన్‌గంగ పరీవాహక ప్రాంతంలో నష్టం వాటిల్లేది కాదన్నారు. ఆమె వెంట నాయకులు ఠాక్రే విలాస్, జీవన్, అక్షయ్, సతీశ్‌రెడ్డి, శివకిరణ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20వేల నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ ప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. పంటలు ముంపునకు గురికావడంతో రైతులు కోలుకోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు కొండ గంగాధర్, వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్, నవీన్ రెడ్డి, సంతోశ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అల్లూరి రాజారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో వేలాది ఎకరాల పంట నష్టం జరిగిందన్నారు. సర్వే ప్రకారం రైతులకు పరిహారం అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు రఫీక్, ప్రభాకర్, రాజేశ్వర్ రావు, చంద్రయ్య, నరేందర్ పాల్గొన్నారు.

పోడు పట్టాలు ఇవ్వాలని ధర్నా



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలంలోని దొడంద గ్రామంలో వంద మంది గిరిజనులకు పోడు పట్టాలు రాలేదని సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట తుడుందెబ్బ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కొంత మంది ఆదివాసీలకు భూములకు సర్వేలు చేయలేదని, సర్వే చేసినా.. హక్కుపత్రాలు రాలేదన్నారు. వచ్చిన వారిలో కూడా పేర్లు, ఎకరాలు తప్పుగా ప్రింట్ చేశారని ఆరోపించారు. పట్టాలు రాని వారిని గుర్తించి పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. తప్పులను సరిచేయాలన్నారు. సాగు భూముల్లో ఫారెస్టు అధికారులు చెట్లు నాటడం, కందకాలు తవ్వడం నిలిపి వేయాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కి వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా అధ్యక్షుడు గణేశ్, పుర్కబాపురావు, పుష్పరాణి, మనోజ్, శ్యాంరావు, ఆదివాసీలు పాల్గొన్నారు.

సంకల్ప రథయాత్రకు మద్దతు



స్వాగతం పలుకుతున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: టీఎస్ సీపీఎస్ఈయూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ చేపట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రకు గిరిజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సోమవారం యాత్ర ఉట్నూర్‌కు చేరుగా టీటీఎఫ్, ఏటీఎఫ్, టీటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాలు మద్దతు తెలుపుతూ ఘనస్వాగతం పలికారు. అనంతరం కేబీ కాంప్లెక్స్ నుంచి ఐబీ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గిరిజన భవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు కాల్వల శ్రీకాంత కపిల్‌కుమార్ జాదవ్, శ్రీకాంత సత్యనారాయణ, మెస్రం గంగారాం, చంద్రకాంత్, లక్ష్మణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

బోథ్: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ శాఖ ఏడీ శ్రీధర్ స్వామి, అధికారులు సోమవారం పరిశీలించారు. మర్లపల్లి గ్రామంలో పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెండి విశ్వామిత్ర, సర్పంచ్ దేవేందర్, ఉప సర్పంచ్ కమలాకర్, రైతులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారులు పరిశీలించారు. కుప్టి, కుమారి గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారి భీమా దినేష్, వడూర్‌లో వ్యవసాయ విస్తరణ అధికారిణి సుప్రియ, బుగ్గారంలో ఏఈవో జైపాల్ పర్యటించారు. వారు మాట్లాడుతూ చేనులో నిలిచిన వర్షపు నీటిని బయటికి పంపించాలన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తాంసి: సీఎం కేసీఆర్ వీఆర్ఏలను క్రమబద్ధీకరించడంతో పాటు పేస్కేల్ వర్తింపజేస్తామని నిర్ణయం తీసుకోవడంతో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్ఏలు క్షీరాభిషేకం చేశారు. సోమవారం భీంపూర్ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుతో కలిసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జెడ్పీటీసీ సుధాకర్, సంతోశ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల ఆకలిని తీర్చేందుకు వెడ్మ భొజ్జన్న బువ్వ కార్యక్రమంలో నిర్వహించడం జరుగుతుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట అన్నదాన నిర్వహించారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



బ్యాగులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

ఇంద్రవెల్లి: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనిషా రిమ్స్‌లోని పిల్లల వార్డులో పండ్లు పంపిణీ చేశారు. సత్యసాయి నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగినేని పవన్‌రావు, భూపతి వెంకటేశ్, గంగారెడ్డి, లింగన్న, ఉదయ్‌కుమార్, శ్రీకాంత్, క్రాంతి, ప్రశాంత్ పాల్గొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో గల వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేశారు.

నేరడిగొండ: మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ అనిల్ జాదవ్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.

- **ఎంపీపీ కార్యాలయ ఆవరణలో**

ఎంపీపీ రాథోడ్ సజన్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో భూమారెడ్డి, సర్పంచ్ పెంట వెంకటరమణ, ఉప సర్పంచ్ ఏలేటి దేవేందర్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు ఏలేటి రవీందర్‌రెడ్డి, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, ఏలేటి మహేందర్ రెడ్డి, బర్దావల్ శ్రీనివాస్, విశాల్ పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని లింగి గ్రామం వృద్ధాశ్రమంలో మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్ కేక్ కట్ చేసి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధులతో కలిసి కేక్‌కట్ చేశారు. కేదరేశ్వర్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, రమాకాంత్, పోచ్చన్న పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఎక్స్‌రోడ్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరామ జాదవ్, బీఆర్ఎస్ నాయకులు దాసండ్ల ప్రభాకర్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ కేట్ కట్ చేశారు. నాయకులు అరికిల్ల అవోక్, మహేశ్, వినోద్ పాల్గొన్నారు.

– మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కందుకూరి రమేశ్ ఆధ్వర్యంలో ఏఆర్ఎల్ కళాశాల ఆవరణలో కేక్‌కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, కోఆప్షన్ రషీద్, ఎస్పీరెడ్డి, కామెరి పోషన్న, సీతారాం పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలోని డేడ్ర గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ భీంరావ్ ఆధ్వర్యంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. గిరిజన రైతులు నాలుగు ఎకరాల్లో మునగ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో చౌహాన్ రాధ, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, గిరిజనులు పాల్గొన్నారు.

కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో నడుస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ బ్యాంక్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, డైరెక్టర్ పోతన్న, సంతోశ్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కేజీబీవీ ఎస్‌వో పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న స్పెషల్ ఆఫీసర్ పోస్టులకు సోమవారం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. స్థానిక నలంద డిగ్రీ కళాశాలలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 11 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 49 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ పున్నరావు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని డీఈవో ప్రణీత పరిశీలించారు.

ఆన్‌లైన్‌లో టీకాల వివరాలు నమోదు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: వ్యాక్సినేషన్‌కు సంబంధించిన వివరాలను యూవిన్ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వైసీ శ్రీనివాస్ అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లకు సోమవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రాహుల్, రమణ తదితరులు పాల్గొన్నారు.